ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక గౌరవం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ముస్లింలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గౌరవం కల్పిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని షాదీమంజిల్ చుట్టూ రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీని బుధవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ముస్లిం సోదరులపై సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రభుత్వం తరపున స్వయంగా సీఎం వైఎస్ జగన్ పాల్గొని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారన్నారు. జిల్లాల వారీగానూ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలపై గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో పొదలకూరు షాదీమంజిల్ మొండిగోడలతో దర్శనం ఇచ్చేదన్నారు. తాను జెడ్పీ నిధులతో షాదీమంజిల్ నిర్మాణాన్ని పూర్తి చేయించినట్లు తెలిపారు. ఆ తర్వాత కొందరు నాయకులు వచ్చారని, షాదీమంజిల్‌ను ఉద్ధరిస్తామని చెప్పి ఉన్న ప్రహరీని ధ్వంసం చేసి వెళ్లారన్నారు. తిరిగి తానే ప్రహరీ నిర్మాణం, చిన్నపాటి మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు చేయించి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తున్నామని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రహరీను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. షాదీమంజిల్‌పైన రాజకీయాలకు పాల్పడడం బాధకరమన్నారు. తాను ఎప్పుడూ ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించి వారి అభివృద్ధికి కృషి చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం ముస్లింల వివరాలను సేకరించడంలో గోప్యతను పాటించాలని అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్ తీర్మానించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ముస్లిం నాయకులు ఎస్‌కే అంజాద్, ముస్తాక్‌మాదనీ, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్‌కే ఖాదర్, షేక్ సిరాజ్, షేక్ హాజీబాషా, జమీర్, ఖాదర్, ఖలీల్, మొహిద్దీన్, దస్తగిరి, మహబూబ్‌బాషా, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కోనం బ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



జగనన్న స్టిక్కర్ అతికిస్తున్న మంత్రి కాకాణి

జగనన్నే మా భవిష్యత్తులో పాల్గొన్న మంత్రి కాకాణి

మరుపూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకుని జగనన్న స్టిక్కర్లను అంటించారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని నందలగుంట, ఎన్‌ఎస్సార్ కాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని 55 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 65,337 గడపలు తిరగామన్నారు. గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరడంతో ఏ గడపకు వెళ్లిన ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడమే కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలకు మేలు చేయడాన్ని ఓర్చుకోలేక ప్రతిపక్షాలు నిరంతరం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారన్నారు. జగనన్న అమ్మఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన, తదితర పథకాలతో పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గడప గడపకు మన ప్రభుత్వంలో తూర్పుఅరుంధతీయవాడకు చెందిన మాజీ వార్డు సభ్యుడు గరికపాటి హరి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ప్రసన్న పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు.



చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా చేయూత

కోవూరుకు చెందిన తల్లిదండ్రుల ఆదరణ కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు ఎన్‌ఎస్సార్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. చుండుగుంటకు చెందిన బద్దిపూడి లాస్యశ్రీ, బద్దిపూడి వికాస్, విఘ్నేశ్వరపురం కాలనీకి చెందిన పోట్లూరు నందినికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.60 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పడుగుపాడు సొసైటీలో చిన్నారుల పేర్లపై డిపాజిట్ చేసి బాండ్లను కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే విఘ్నేశ్వరపురం కాలనీకి చెందిన ముగురు మహిళలకు కుట్టు మెషిన్లు అందజేశారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి , సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు చిరంజీవి, మల్లిఖార్జున, అంజనరావు, ప్రసాద్,అనూప్‌రెడ్డి, భాస్కర్, సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సభ్యులు వేణుగోపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



ముత్తుకూరు: స్థానిక బీసీ కాలనీలోని మసీదు లో ఇఫ్తార్ విందును బుధవారం ఏర్పాటు చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత ఈదూరు రామమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ రామారావు బుధవారం ప్రారంభించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన పంచేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. ఎస్సై వీరప్రతాప్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న అల్లాబక్షు, కనిసిరి వెంకయ్య పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



కొడవలూరు: కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నె, సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంఈఓ వసంత కుమారి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం నాడు-నేడు కింద మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.13 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, ఎజ్రా ఉన్నారు.

ఉచితంగా మినుము విత్తనాల పంపిణీ



పొదలకూరు : మండలంలోని రైతులకు మినుము విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నట్లు ఏఓ వాసు తెలిపారు. మండలంలోని మరుపూరు ఆర్‌బీకేలో రైతులకు మినుము విత్తనాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుపూరు, తోడేరు, ఇనుకుర్తి గ్రామాల్లోని రైతులకు నాలుగు కిలోల మినుము విత్తనాల సంచులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వేసవిలో పప్పుదినుసులు పండించే కార్యక్రమంలో భాగంగా విత్తనాలను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. మరుపూరు సర్పంచ్ నాగయ్య, వీఏఏలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పొదలకూరు అగ్నిమాపక అధికారి విజయవరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వంట గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సంభవించే అగ్నిప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పొగ తాగి నిర్లక్ష్యంగా పడేయడం వల్ల వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవిస్తాయన్నారు.

యువతి అదృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నాగమాంబపురానికి చెందిన 21 ఏళ్ల యువతి ఈ నెల 17న ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా అదృశ్యమైంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

త్వరితగతిన పునరావాస కార్యక్రమాల పూర్తి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ముత్తుకూరు మండలంలోని నేలటూరులో పునరావాస కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో పునరావాస చర్యల పురోగతిపై జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోలతో సమీక్షించారు. నేలటూరులో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ నగదును కంపెనీల ప్రతినిధులు త్వరగా జమచేసేలా చూడాలన్నారు. జెన్‌కో ఎస్ఈ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కోవూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి సూచించారు. ఇనమడుగు, లేగుంటపాడు గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సమయాన్ని పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఇంటి, కుళాయి పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలని సూచించారు. ఈఓపీఆర్డీ బీ కల్పన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇనమడుగులో రికార్డులను పరిశీలిస్తున్న చిరంజీవి

ముగిసిన సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో జరుగుతున్న సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అర్ధరాత్రి గరుడోత్సవం(శాంతి ఉత్సవం)తో ముగిశాయి. మండలంలోని సంగమేశ్వరాలయంలో కల్యాణోత్సవం జరుపుకొన్న శివపార్వతులు మనుబోలులోని శివాలయానికి వచ్చే క్రమంలో స్థానిక విష్ణాలయం వద్ద విష్ణుమూర్తి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అందుకు బదులుగా బ్రహ్మోత్సవాల చివరి రోజు ఆది దంపతుల వద్దకు అతిథిగా వెళ్లిన విష్ణుమూర్తికి వారు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. సంప్రదాయంలో భాగంగా మంగళవారం రాత్రి విష్ణాలయంలో అర్చకులు హనుమాచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవంగా శివాలయం వద్దకు తీసుకొచ్చి పట్టు వస్త్రాలు సమర్పించారు. దీంతో సంగమేశ్వరుడి ఉత్సవాలు ముగిశాయి.



గరుడ వాహనంపై ఊరేగుతున్న విష్ణుమూర్తి

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

కోవూరు(విడవలూరు): ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడైనా అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బీ సుజాత పేర్కొన్నారు. విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జూనియర్ మ్యాథ్స్ లెక్చరర్‌గా బదిలీపై వెళ్తున్న అనూరాధను సహచర సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్‌గా అనూరాధ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అనూరాధను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ బీ సుజాత, సహచర సిబ్బంది

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



మనుబోలు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



పొదలకూరులో..

మనుబోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో జట్లకొండూరు పంచాయతీ పరిధిలోని సమస్యలన్నీ పరిష్కారమై గ్రామం అభివృద్ధి బాట పట్టిందని ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం పేర్కొన్నారు. జట్లకొండూరు పంచాయతీ జ్యోతినగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రేణక, సాయి, అవినాష్, శివమ్మ, పరశురాం, నాగరాజు, బుజ్జమ్మ, నాగేశ్వరావు, రమ, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : స్థానిక ఏసీనగర్ కాలనీలో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: కూనంపాడులో..

కొడవలూరు: తలమంచి మజరా కూనంపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్ యాటగిరి భాస్కర్, సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



విడవలూరు మండలం దండిగుంటలో..

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం దండిగుంట పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్, కే చినమస్తానయ్య, కే పవన్, జే నారాయమణ, పిడుగు నాగార్జున, శివ, వినయ్, వలంటీర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవూరు: మండల కేంద్రమైన కోవూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి బుధవారం తెలిపారు. పెళ్లకూరు కాలనీ, ఎన్ఎస్ఆర్ కాలనీ, మెయిన్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



కొడవలూరు: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని ఎస్ఈబీ సీఐ ఆర్ నరహరి పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని సాయి లెండి డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులుగా మారుతారన్నారు. మత్తుకు బానిసగా మారితే సమాజంలో విలువ కోల్పోతామన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ కే శశికాంత్‌రెడ్డి, ఎస్ఈబీ సిబ్బంది కే.శ్రీనివాస్, తులసి, మహిళా పోలీసు వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.257 కనీస వేతనం వచ్చేలా పనులు

- డ్వామా పీడీ వెంకటరావు



పొదలకూరు : ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని డ్వామా పీడీ వెంకటరావు సూచించారు. మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో జరుగుతున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం ఇనుకుర్తి గ్రామంలో కూలీలకు రూ.230 వస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.257 గిట్టుబాటయ్యేలా పనులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు కోటి పనిదినాలను పూర్తి చేసినట్లు వివరించారు. మార్చి నెలాఖరు నాటికి మరో 15 లక్షల పనిదినాలను పూర్తి చేయించామన్నారు. పీడీ వెంట ఏపీఓ మధుసూదన్, టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్రగాయాలు



పొదలకూరు : మండలంలోని నావూరుపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు నుంచి నావూరుకు వెళుతున్న కియా కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో నావూరుపల్లికి చెందిన దయాకర్(35) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని బంధువులు పొదలకూరు సీహెచ్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం నెల్లూరు మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటాచలం: రెవెన్యూ పరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తహసీల్దార్ టీ కృష్ణ పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మందా కవిత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు అసైన్డ్ భూముల పంపిణీ, జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల బిల్లులు, రెవెన్యూ పరమైన సమస్యలనుచి ప్రస్తావించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. మండలంలోని చుక్కల భూములను సమస్యను పరిష్కరిస్తామన్నారు. అగ్రిమెంట్ భూములను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామన్నారు. అసైన్డ్ భూముల పంపిణీకి సంబంధించి అర్హుల జాబితాను సిద్ధం చేశామన్నారు. సర్వే పూర్తి చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూముల పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, ఎంపీడీఓ సుస్మిత, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

బుచ్చిరెడ్డిపాళెం: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని తిరుపతి శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రేబాలలోని సాయిబాబా కల్యాణ మండపంలో శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం రైతులు ప్రకృతి వ్యవసాయానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసాయనాలు లేని ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా గత మూడు నెలలుగా బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలాల్లో పర్యటిస్తున్న విద్యార్థులు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల చేపడుతున్న పంటల సాగు విధానాలపై క్షుణ్ణంగా పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను తిలకించారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, శాస్త్రవేతలు లలితాశివజ్యోతి, సురేఖాదేవి, ఉజ్వలరాణి, ప్రొఫెసర్లు సత్యగోపాల్, లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానికులు శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల డీన్ ప్రభాకర్‌రెడ్డి

రీ సర్వేను పక్కాగా చేపట్టాలి



మనుబోలు: రీ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది



బుచ్చిరెడ్డిపాళెం: రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రీ సర్వేను పక్కాగా చేపట్టాలని జేసీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మండలంలోని చెల్లాయపాళెంలో జరుగుతున్న భూముల రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాల్లో రీ సర్వేను పూర్తి చేశామని తెలిపారు. త్వరలోనే మిగిలిన అన్ని గ్రామాల్లోనూ సర్వేను పూర్తి చేస్తామన్నారు. జేసీ వెంట తహసీల్దార్ సుధీర్, డీడీ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

మనుబోలు: రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. మండలంలోని అనుపల్లిపాడు, కట్టువపల్లి గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. హద్దు రాళ్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీ సర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వోలు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల సుధీర్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, జానకిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు

ఇందుకూరుపేట: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎఫ్‌డీఓ సురేష్ తెలిపారు. మైపాడులో మత్స్యకార ఉత్పత్తిదారుల సహకార సంఘం మొదటి సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీఓ పాల్గొని మాట్లాడారు. సహకార సంఘం ద్వారా మత్స్యకార ఉత్పత్తిదారులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ ప్రాజెక్ట్ మేనేజర్లు భరత్, రవి, తదితరులు పాల్గొన్నారు.